క్లుప్తంగా

గంగమ్మకు పూజలు


పూజలందుకుంటున్న గంగామాత

ఆదోని టౌన్: గంగాభవానీ దేవాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి అభిషేకాలతో పూజలు నిర్వహించారు. పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఊరేగింపు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, ఆటో వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వీరేష్, దుల్లయ్య, మున్సిపాల్ వీరేష్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దుప్పట్లు, చలికోట్ల పంపిణీ


ప్రభుత్వ ఆసుపత్రిలో రోగికి దుప్పటి అందజేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున స్థానిక సల్వీ బైతుల్‌మాల్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరుపేదలకు, రోగులకు దుప్పట్లు, చలికోట్లు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆదివారం ట్రస్ట్ అధ్యక్షుడు ఉమర్ ఉమరి, సభ్యులు మూసా జామఈ, సిబగుతుల్లా మౌలానా, ఉమ్రి అబ్దుల్ వహబ్, ముజీబ్, మనీయార్ అమానుల్లా, ఖదీర్ నజీర్ తదితరులు స్థానిక మైనారిటీ కాలనీలోని నిరుపేదలకు, ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు వంద దుప్పట్లు, చలికోట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా గత ఐదు సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలికాలంలో దుప్పట్లు, చలికోట్లు అందజేసి తమ వంతుగా ఆదుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు.

బదినేహాల్ సర్పంచ్ నరసప్ప మృతి


కౌతాళం : మండల పరిధిలోని బదినేహాల్ గ్రామానికి చెందిన సర్పంచు పెద్ద నరసప్ప (61) అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. ఆదివారం ఉదయం స్వగృహంలోనే కనుమూశారు. మృతుడికి ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. ఆయన అకాల మరణం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు. కాగా 2021లో జరిగిన ఎన్నికల్లో మాల రామప్ప సర్పంచుగా ఎన్నుకోబడ్డారు. అయితే అనారోగ్యంతో ఆయన 2022 అక్టోబర్ 9న కనుమూశారు. అనంతరం 2023 ఆగస్టు 20 జరిగిన స్థానిక ఎన్నికల్లో పెద్ద నరసప్పను సర్పంచుగా ఎన్నుకున్నారు. ఆయన కూడా సోమవారం అనారోగ్యంతో చనిపోయారు. రెండేళ్లలో ఆ గ్రామం ఇద్దరు సర్పంచులను కోల్పోవడం విషాదకరం. నరసప్ప మృతిపట్ల వైఎస్సార్‌పీపీ గ్రామ నాయకులు లక్ష్మిరెడ్డి, వీరభద్రగౌడ్, నగేష్‌రెడ్డి, రవి గౌడ్, ఉప సర్పంచు ప్రసన్న గౌడ్ సంతాపం తెలిపారు.

మహాత్మా.. ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించండి


పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికై చేపట్టిన నిరవధిక దీక్షలు 11రోజుకు చేరుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ, శివరామకృష్ణ, నరసప్పలు అన్నారు. దీనికి నిరసనగా ఆదివారం పట్టణంలో ర్యాలీ చేపట్టి, గాంధీ సర్కిల్ వరకు వెళ్లి తమ సమస్యలకు పరిష్కారమార్గాన్ని చూపేలా ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్దన్, రాజేంద్రకుమార్, హంసరాజు, యూసుఫ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడితో శబరిమలకు


ఇరుముడితో శబరిమలకు పయనమవుతున్న అయ్యప్పస్వాములు

పెద్దకడబూరు: మండలంలోని అయ్యప్ప మాలాధారులు ఆదివారం గురుస్వామి నాగరాజు ఆధ్వర్యంలో శబరిమలకు బయలుదేరారు. స్థానిమ రామలింగేశ్వరస్వామి ఆయలంలో తెల్లవారిజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి ఇరుముడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గురుస్వామి నాగరాజు మాట్లాడుతూ 40రోజుల పాటు ఎంతో నిష్టగా చేపట్టిన దీక్ష మనస్సులో మార్పు తెస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.

గ్రాసం.. భారం

- స్థానికంగా పశుగ్రాసం కొరత
- వాణిజ్య పంటలకు రైతుల ప్రాధాన్యత
- వేసిన పంటలు అంతంత మాత్రమే దిగుబడి
- పక్కరాష్ట్ర నుంచి వరిగడ్డిని అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి

ఆదోని సెంట్రల్: డివిజన్ పరిధిలో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. ప్రకృతి అనుకూలించక స్థానికంగా పంటలు సరిగా పండప పోవడం, స్థానిక రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలపై దృష్టి సారిస్తుండటంతో వరిగడ్డి కొరత ఏర్పడింది. దీంతో పశుపోషకులు పక్కరాష్ట్రానికి వెళ్లి అధిక ధరకు కొనితెచ్చుకోవాల్సిన పరిస్థితి.

1.20 లక్షల ఆవులు, ఎద్దులు

ఆదోని డివిజన్ పరిధిలో 1.20 లక్షల ఆవులు, ఎద్దులు ఉన్నాయి. 80 వేల దాకా బర్రెలు, గేదెలు ఉన్నాయి. డివిజన్‌లో సాగునీటి వనరులు తక్కువగా ఉన్నాయి. అక్కడక్కడ చెరువులు, కుంటలతో పాటు ఎల్ఎల్‌సీ కాలువ కింద పంటలను సాగు చేస్తున్నా, వర్షాధారంపైనే ఎక్కువగా పంటలను పండిస్తున్నారు. దీనికి తోడు రైతులు దాదాపు వాణిజ్య పంటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతోంది. పాడి రైతులు పశుగ్రాసానికి సంబంధించి మొక్కజొన్న, జొన్న, కొర్రలు, సజ్జలు వంటి పంటలను సాగు చేస్తే ఈ పరిస్థితి దాపురించదు.


ట్రాక్టర్‌లో పశుగ్రాసాన్ని తీసుకొస్తున్న పాడి రైతు

ట్రాక్టర్ గడ్డి రూ.10 వేల నుంచి రూ.12వేలు

ఎండకాలంలో గడ్డికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ముందుగానే వరిగడ్డిని కొని నిల్వ చేసుకుంటున్నారు. దీంతో రైతులు నీటి లభ్యత ఉన్న ప్రాంతానికి వెళ్లి వరిగడ్డిని కనుగోలు చేసి ట్రాక్టర్‌లో తెచ్చుకుంటున్నారు. పాడి రైతులు వరిగడ్డిని ఎక్కువగా కర్ణాటక రాష్ట్రంలోని శిరుగుప్ప, మాధవవరం, బళ్లారి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. పాడి రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అక్కడి రైతులు ధరలను అమాంతంగా పెంచుతున్నారు. ఎకరాకు 35 నుంచి 40మోపులు వచ్చే గడ్డిని రూ. 10వేలకు పైనే విక్రయిస్తున్నారు. గతంలో ఎకరా గడ్డిని రూ.4వేలు నుంచి 5వేలకు అమ్మే వారని, ఇప్పుడు ఒక ట్రాక్టర్ గడ్డిని రూ. 10వేల నుంచి 12వేలకు కొనే పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. కొంత మంది పశుగ్రాసం కొరత ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. ఎకరా గడ్డిని రూ. రూ.7వేలు నుంచి 8 వేలకు కనుగోలు చేసి పాడి రైతులకు ట్రాక్టర్ గడ్డిని రూ.12 వేలకు విక్రయిస్తున్నారు.

గతంలో రాయితీపై పంపిణీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు రాయితీ కింద పశుగ్రాసాన్ని పంపిణీ చేసేది. పాల ఉత్పత్తిని పెంపొందించడానికి మిశ్రమ దాణాను కూడా రాయితీ కింద పంపిణీ చేసే వారు. అలాగే పశుగ్రాసం పెంపకానికి సబ్సిడీ కింద మొక్కజొన్న, జొన్న, సజ్జలు, కొర్ర, పిల్లిపెసర, హైబ్రిడ్ నెపియర్ విత్తనాలను కూడా అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవి ఏపీ పాడి రైతులకు ఇవ్వడం లేదు. దీంతో పశుపోషకులు అవస్థలు పడుతున్నారు.

“పశుగ్రాసం పంటలను సాగుచేసుకుంటే మంచిది



పాల ఉత్పత్తి పెరగడానికి పశుగ్రాసం చాల అవసరం. పాడిరైతులు పశుగ్రాసం అందించే పంటలు అంటే మొక్కజొన్న, జొన్న, సజ్జలు, హైబ్రిడ్ నెపియర్, పిల్లపెసర వంటి పంటలను సాగు చేసుకుంటే మంచిది. గతంలో రాయితీ కింద పశుగ్రాస విత్తనాలతో పాటు పశుగ్రాసం, పాల ఉత్పత్తికోసం మిశ్రమ దాణాను కూడా పంపిణీ చేయడం జరిగింది. ప్రభుత్వం రాయితీ మీద పశుగ్రాసం, మిశ్రమ దాణాను అందిస్తే తప్పకుండా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకొంటాం.

– డా.విజయకుమార్, పశువైద్యాధికారి

ఉరకుందలో నేడు రుద్ర హోమం

కౌతాళం : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరకుంద ఈరన్న స్వామి సన్నిధిలో మంగళవారం రుద్ర హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ విజయరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి నెలా రుద్ర హోమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల భక్తులు సేవ రుసుం రూ.1500 చెల్లించి హోమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హోమంలో పాల్గొన్న సేవా భక్తులకు ఆలయ తరపున శేషవస్త్రం, రెండు లడ్డూ ప్రసాదాలు, పూల మాలలు అందజేయనున్నట్లు వివరించారు. ఉదయం 9 గంటల్లోపు సేవా భక్తులు ఆలయం చేరుకోవాలని కోరారు.

రేపు సామాజిక తనిఖీ

గోనెగండ్ల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ ఉంటుందని ఏపీఓ మహమ్మద్ బాషా ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులపై సభ ఉంటుందన్నారు. గత వారం రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం విచారణ చేపడుతోందని చెప్పారు. ఆ తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారుల సమక్షంలో సభ ఉంటుందని వెల్లడించారు.

కవి గద్వాల సోమన్నకు సన్మానం


'అనుబంధాలు' పుస్తకాన్ని పరిచయం చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు, కవి గద్వాల సోమన్నను ఆదివారం సన్మానించారు. మంత్రాలయం మండలంలోని పరిమళ విద్యానికేతన్ పాఠశాలలో అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 142వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో ఆ సంస్థ అధినేత డాక్టర్ కత్తిమండు ప్రతాప్, విచ్చేసిన శ్రీశ్రీ కళావేదిక కార్యవర్గం, కవులు, కళాకారులు, ప్రముఖులు ఆధ్వర్యంలో సోమన్నను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన అనుబంధాలు పుస్తకాన్ని పరిచయం చేశారు. ఆయన అనతి కాలంలోనే 60పుస్తకాలను రచించినందుకు కొనియాడారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు మశేకర్ నాగజ్యోతి, డాక్టర్ బల్లారి ఉమాదేవి, సువర్ణజోషి, శోభామణి, ఈశ్వరి, కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ అమలు చేయాల్సిన గడువు ముగిసి 18 నెలలయ్యిందన్నారు. కావున వెంటనే ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి, పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు రూ.21వేల కోట్లను వెంటనే చెల్లించే ప్రక్రియ చేపట్టాలని కోరారు. 9 నెలల నుంచి పీఎఫ్ రుణాలు, 32 నెలల నుంచి సరెండర్ లీవ్స్ బకాయిలతో పాటు డీఏ బకాయిలను సత్వరం చెల్లించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు ప్రసన్నరాజు, బసవరాజు, చంద్రశేఖర్, ఉరుకుందాచారి, రంగన్న, నాగరాజు, రాఘవేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి


బాపురం హనుమంత రెడ్డి (ఫైల్)

పెద్దకడబూరు : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాపురం హనుమంతరెడ్డి(79) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన ఎంపీపీ, జెడ్పీటీసీ, సింగిల్‌విండో అధ్యక్షుడిగా పనిచేసి మండలంలో తిరుగులేని నాయకుడు అని పేరు సంపాదించుకున్నాడు. ఇటీవల ఆయన భార్య ఈరమ్మ (ఆగస్టు 6న) చనిపోగా ఆయన రెండో కొడుకు బాపురం వీరసేనారెడ్డి (డిసెంబర్ 3న) అనారోగ్యంతో చనిపోయాడు. ఆదివారం (15 డిసెంబర్) రోజున 13వ రోజు దినం కార్యక్రమం జరిపారు. బంధువులందరూ దినానికి వచ్చి భోజనం చేసిన అనంతరం వారివారి స్వగ్రామాలకు వెళ్లిపోయారు. అయితే అదేరోజు సాయంత్రం ఆయన ఆరోగ్యం క్షీణించి కిందపడిపోగా గమనించిన పెద్ద కొడుకు చంద్రశేఖర్‌రెడ్డి(రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్), కుటుంబసభ్యులు డాక్టర్‌ను సంప్రదించగా అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మంచి నాయకుడిని కోల్పోయాం

మండలంలో మంచి నాయకున్ని కోల్పోయామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయనతో ఉన్న అనుబంధం చెప్పలేనిదన్నారు. ఆయన లేడు అన్నవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని కోరుకుంటూ, కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

20న పెరవలిలో వేలాలు

మద్దికెర : మండలంలోని పెరవలిలో వెలసిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో సంవత్సరం పాటు టెంకాయలు, తమలపాకులు అమ్ముకునేందుకు దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో షీల్డ్ కొటేషన్, బహిరంగ వేలం ఈనెల 20వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు దేవాలయ ఆవరణలో నిర్వహిస్తామని ఈఓ వీరయ్య ఆదివారం తెలిపారు. ఆసక్తి గల పాటదారులు రూ.50 వేలు ధరావత్తు చెల్లించి వేలాల్లో పాల్గొనాలని సూచించారు.

రమణీయం.. మహారథోత్సవం


భక్తజనుల మధ్య స్వామివారి మహారథోత్సవం


కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణి ధరణి

ఆదోని అర్బన్: పట్టణ శివారులో మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీమంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో మహా రథోత్సవంతో ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ మేరకు ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు ఉదయం స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, రథోత్సవ హోమం, సామూహిక సత్యనారాయణ వ్రతం, నైవేద్యం తదితర పూజలు నిర్వహించారు. బెంగళూరు నుంచి తెచ్చిన వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కూచిపూడి నృత్యంలో ధరణి అనే కళాకారిని ప్రత్యేకంగా ఆంజనేయస్వామి గీతాలతో ప్రదర్శించారు. అదేవిధంగా మహిళలు కోలాటంతో అలరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహా రథోత్సవం రమణీయంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


రథోత్సవ హోమం నిర్వహిస్తున్న దృశ్యం


కోలాటమాడుతున్న మహిళలు

అమరజీవికి ఘన నివాళి


ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టర్, అధికారులు


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అవోపా సభ్యులు

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, ఉప తహసీల్దార్ వలీబాషా, రాఘవేంద్ర, వినీత్, ఉప గణాంక అధికారి లక్ష్మోజీ పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే డీఎస్పీ బంగ్లా వద్ద ఉన్న మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అవోపా అధ్యక్ష కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, రఘు, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు హాజరయ్యారు.

రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం

ఎమ్మిగనూరుటౌన్: ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకై తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, యూకే రాజశేఖర్, పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, యుక నందవరం మండల కన్వీనర్ శివప్పగౌడ్, నాయకులు వెంకటాపురం బజారి, ఎంకె శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుడి రథోత్సవం

కోసిగి : మండలంలోని సజ్జలగుడ్డం వాసుల ఆరాధ్య దైవం మార్లబండ ఆంజనేయస్వామి జాతర మహోత్సవం కనుల పండువగా సాగింది. పౌర్ణమి సందర్భంగా ఆదివారం మహా రథోత్సవం చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు విశ్వనాథ్ రెడ్డి, మల్లిర్జున రెడ్డి, హనుమంతురెడ్డి నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. అశేష భక్తజన వాహిని మధ్య స్వామి రథయాత్ర విశేషంగా సాగింది. గ్రామస్తులు, వివిధ గ్రామాల ప్రజలు ఉదయం పిండివంటలతో నారికేళాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు ముక్కరయ్య, పరప్ప, నాగేంద్రప్ప పాల్గొన్నారు.

దేవరగట్టులో విశేష పూజలు


స్వామికి పూజలు చేస్తున్న పూజారి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఈనెల 19వ తేదీన విజయవాడలో జరిగే ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మెడికల్ ఎంప్లాయీస్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ 6వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు, సెక్యూరిటీ కార్మికులను కలిసి మహాసభల ప్రాధాన్యత గురించి వివరించారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేస్ట్ కంట్రోల్ సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సరైన పనిముట్లు యూనిఫాం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి బి.వెంకన్న, వై.టి.భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చింతలాముని స్వామి జయంతి


స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు


పూజలందుకుంటున్న స్వామివారు

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన చింతలాముని స్వామి జయంతిని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామి మూల విరాట్‌కు తుంగభద్ర జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఆకుపూజ, నైవేద్యం, మహామంగళహారతి, స్వామివారికి ఉయ్యాలసేవ, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహానికి దేవాలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. వేడుకలకు వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

నందవరం : మండలంలోని నాగలదిన్నె గ్రామ శివారులో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. మండల పరిధిలోని కనకవీడు గ్రామానికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి ఆటోలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా నాగలదిన్నె గ్రామ సమీపంలో పోలీసులు దాడులు చేపట్టి పట్టుకున్నారన్నారు. నిందితుడు పారిపోయాడని, ఆటోలో కర్ణాటక మద్యం 8 బాక్సులు(768 ప్యాకెట్లు), జాన్స్ ఒరిజినల్ ఛాయిస్ డీలెక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్ల(90 ఎంఎల్)ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు


విద్యార్థినుల నాట్య ప్రదర్శన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ సమ్మేళనానికి జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేసిన 1986 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు చదువుకున్న విద్యార్థులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఈ పద్మావతి మాట్లాడుతూ విద్యాలయం ఏర్పడినప్పటి నుంచి చదువుకున్న విద్యార్థులు సమ్మేళనానికి రావటం చాల సంతోషంగా ఉందని చెప్పారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చాల మంది ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీలు, ఇంజినీర్లు, డాక్టర్లు, ఇతర ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, అలాగే వ్యాపార రంగాల్లో చాల మంది రాణిస్తున్నారని చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీ హోదాల్లో ఉన్న వారు విధి నిర్వహణలో బీజీగా ఉన్నందున ఈ సమ్మేళనానికి హాజరుకాకపోయినా తమ సందేశం పంపారని తెలిపారు. ఎక్కడ ఉన్న మనకు విద్యనేర్పిన గురువులను, విద్యాలయాన్ని మరచిపోరాదని చెప్పారు. ఇంత మంది తమ పిల్లలు, భార్యభర్తలతో కలసి రావడం ఆనందానిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూర్వపు విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ను సన్మానించారు.